క్లుప్తంగా

నేడు చీఫ్‌విప్ ముదునూరి షెడ్యూల్

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు బుధవారం ఉదయం 9.30 గంటలకు నరసాపురం 1వ వార్డులో రూ.20 లక్షలతో సీసీ రోడ్, డ్రెయిన్ నిర్మాణాలకు శంకుస్థాపనచేస్తారు. 10 గంటలకు చీఫ్‌విప్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు క్యాంపు కార్యాలయంలో ప్రసాదరాజు అందుబాటులో ఉంటారని కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా వింజమూరి

నరసాపురం రూరల్: పద్మశాలి సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన వింజమూరి నాగ వెంకటసురేష్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఉమ్మడి పద్మశాలి సంఘం అధ్యక్షుడు వానపల్లి నాగరాజు నుంచి నియామకపు ఉత్తర్వు అందుకున్నట్టు సురేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో పద్మశాలీ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, షరతులు లేకుండా అమ్మఒడి పథకాన్ని కుటుంబంలో విద్యార్థులందరికీ మంజూరు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుందర్, టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా నుద్దేశించి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ. 3 వేలు ఇవ్వాలని, అమ్మాయిల రక్షణ కోసం హాస్టళ్ల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి జి గణపతిరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

14 మందికి ఉద్యోగాలు

సాక్షి, భీమవరం : పాలకొల్లు చాంబర్స్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో భీమవరం డీఎన్నార్ కళాశాల విద్యార్థులు 14 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌జీ సోమరాజు, పి.రామకృష్ణంరాజు, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎండీ శిరాజ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పి.శిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

సాక్షి, భీమవరం : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీజీ అందించిన స్వాతంత్ర్య ఫలాలు అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసాన్ని రాసి ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రం ఆగస్టు 6వ తేదీ లోపుగా పంపించాలన్నారు. విజేతలకు పాఠశాల, కళాశాల స్థాయిలో వేరువేరుగా బహుమతులు అందచేస్తామన్నారు. వ్యాసాలను కార్యదర్శి సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరామపురం, భీమవరం–2 అనే చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలని ప్రసాదరాజు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ఆకివీడు : లోతట్టు ప్రాంతాల్లో అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నిందారోపణలు చేస్తున్నాయని నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు విమర్శించారు. స్థానిక భుజబలరాయుడు మంచినీటి చెరువు వద్ద ఏళ్ల తరబడి పేరుకుపోయిన ఫిల్టర్‌బెడ్‌లోని మట్టి ఇసుకను లోతట్టు ప్రాంతాలకు తరలించడంపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన మంగళవారం తీవ్రంగా ఖండించారు. గత కొన్నేళ్లుగా పంచాయతీకి చెందిన ఫిల్టర్ బెడ్ మట్టి ఇసుకను ఇదే విధంగా ఉపయోగించుకున్నారన్నారు. ప్రస్తుతం మట్టి ఇసుకను బాలికోన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణం లోతట్టుగా ఉండటంతో దానిలో పూడ్చామన్నారు. దీంతో విద్యార్థులకు ముంపు బెడద తప్పిందని పండు చెప్పారు. అవిధంగా మాదివాడలోని దళిత పేట ప్రధాన రహదారి మార్జిన్‌లోనూ, రాళ్ల చెరువు గట్టును బహిర్భూమిగా ఉపయోగించకుండా ఆప్రాంతాన్ని, లోతట్టుగా ఉన్న శాఖా గ్రంథాలయ ప్రాంతాన్ని పూడ్చివేయడం తప్పా అని పండు ప్రశ్నించారు. అభివృద్ధికి ఇది అడ్డుకాదా అన్నారు. మట్టిఇసుకను అమ్ముకున్నారనడం వారి అవివేకమన్నారు. గతంలో ఇదే మట్టి ఇసుకను టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులకు అడ్డంగా ఉపయోగించారని పండు ధ్వజమెత్తారు. స్థానిక గాలిబ్ చెరువు గోడ నిర్మాణంలోనూ, పంచాయతీ పనుల్లోనూ మట్టి ఇసుకను వినియోగించిన దాఖలాలున్నాయన్నారు. ప్రతిపక్షాలు హుందాగా వ్యవహరించాలని, వారికి ఎమ్మెల్యే తోడుకావడం బాధాకరంగా ఉందని పండు అన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి ప్రతిపక్షాలు సూచనలు, సలహాలిస్తూ ముందుకు తీసుకువెళ్లాలని పండు అన్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, దళిత పేట మహిళలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు అపూర్వ స్పందన


కాళీపట్నంలో అర్హత పత్రం అందజేస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు


శివదేవునిచిక్కాలలో ధ్రువ పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీనివాస్


వద్దిపర్రులో ధ్రువ పత్రం అందిస్తున్న ఎంపీపీ సుమంగళి సాగర్, సర్పంచ్ రాజేంద్రప్రసాద్


తూర్పుతాళ్లులో ధ్రువ పత్రం అందిస్తున్న ప్రసాదరాజు

ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: జగనన్న సురక్ష కార్యమానికి అపూర్వ స్పందన లభిస్తోందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు, రామన్నపాలెం–1 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తోటలో 330, రామన్నపాలెం1లో 1042 ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కాళీపట్నం తూర్పు సభలో ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రజలకు పైసా ఖర్చు లేకుండా 11 రకాల ధ్రువ పత్రాలను అందిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రతి సచివాలయానికీ సుమారు 20 శాఖలకు చెందిన ఉద్యోగులు ఉంటున్నారని తెలిపారు. సచివాలయ స్థాయిలోనే ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టిందన్నారు. సర్పంచ్‌లు బందెల ఏలిషా, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అయితం ధనలక్ష్మి, ఆకన దుర్గ, తణుకుల శ్రీవెంకట దుర్గ, మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి, తహసీల్దార్ జి.అనితాకుమారి, ఎంపీడీఓ వి.బాబ్జిరాజు, నాయకులు కర్రి ఏసుబాబు, పడవల ఏడుకొండలు, అనంత సుబ్రమణ్యం, కవురు పెద్దిరాజు, తణుకుల వెంకన్న, అయితం బాబులు, అడ్డాల సాంబమూర్తి, ఆకన దొరబాబు, తణుకుల సురేష్, డీటీ నరేష్, ఏఓ రహీమ్, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు చేరాలి

పోడూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని మట్టపర్రు గ్రామ సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాస్ అన్నారు. మట్టపర్రులో ఆయన అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, ఎంపీడీఓ డి.సుహాసిని చేతులమీదుగా లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. వైఎస్ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, ఉపసర్పంచ్ విద్యంశెట్టి సత్యనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు కొల్లాబత్తుల రవికుమార్, వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● వద్దిపర్రు సచివాలయం వద్ద సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు, ఎంపీటీసీ విప్పర్తి శారద, ఉపసర్పంచ్ కడలి లోహిదాసు, ఆర్‌ఐ కందుల రాంబాబు, వీఆర్‌ఓ ఎం.శ్రీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పెనుమంట్ర: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సమస్యనూ పరిష్కరించే దిశగా జగనన్న ప్రభుత్వం అడుగులు వేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం పొలమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 1, 2 సచివాలయాల్లో సర్పంచ్ కాకర రాజేశ్వరరావు అధ్యక్షతన జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ పశ్చిమ డెల్టా పరిధి గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.4 వేల కోట్లతో పైప్‌లైన్ నిర్మించి గోదావరి జలాలను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో పుష్కలంగా ఉన్న భూగర్భ జలాలు కలుషితమయ్యాయని అందుకే ఈ ప్రాజెక్ట్ చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. గ్రామానికి చెందిన గుబ్బల వెంకటేశ్వర్లు అనే వికలాంగునికి ఉపాధి కల్పించాలని అధికారులను రంగనాథరాజు ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురికి రేషన్ కార్డులు, ధ్రువ పత్రాలను అందజేశారు. పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వి.వెంకటరమణ, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ కె.గౌరీ సుభాషిణి, ఎంపీటీసీ పెచ్చెట్టి నర్సింహమూర్తి, మండల పార్టీ కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కలిదిండి దినేష్‌రాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు వడ్లమూడి ప్రదీప్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యంరాజు, మేనీడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పొలమూరులో ధ్రువ పత్రం పంపిణీ చేస్తున్న శ్రీరంగనాథరాజు

పేదల సంక్షేమమే లక్ష్యం

పాలకొల్లు అర్బన్: పేదల సంక్షేమంకోసం నవరత్నాల పథకాలు అమలుచేసి ఆదర్శపాలన అందిస్తోన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల, పూలపల్లి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్ర నిర్వహించి ప్రజల కష్ట సుఖాలను స్వయంగా తెలుసుకుని, నవరత్నాల పథకాలను రూపొందించి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు సంక్షేమ లబ్ధిని జమచేసిన ఘనత సీఎం జగన్‌కి దక్కుతుందని చెప్పారు. పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. చిన్న, చిన్న కారణాలతో పథకాలు నిలిచిపోయిన లబ్ధిదారులకు న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. శివదేవునిచిక్కాలలో రూ.4.79 కోట్లతో సీసీ రోడ్లు, నాడు – నాడులో పాఠశాల భవనాలు నిర్మించినట్టు వివరించారు. శివదేవునిచిక్కాలలో 600 మందికి, పూలపల్లిలో 1093 మందికి 11 రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిడ్ల మణివజ్రం, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, ఉపసర్పంచ్ ఆకుల మురళి, ర్యాలి వర్ధిని, ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి కె.కాశీ విశ్వనాథంపాల్గొన్నారు.

● పాలకొల్లు వీవర్స్ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, సచివాలయ కన్వీనర్ ఎంఎస్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు చేయడమే లక్ష్యం

నరసాపురం రూరల్: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికీ మేలు చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం నరసాపురం మండలం తూర్పుతాళ్లు–1, –2 గ్రామ సచివాలయాలు, పట్టణంలోని 14, 15 వార్డు సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యతిథిగా పాల్గొన్న ప్రసాదరాజు మాట్లాడుతూ అర్హులందరికీ కుల, ఆదాయ ధ్రువ పత్రాలు, కౌలురైతు కార్డులు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. సురక్షలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అర్హులను గుర్తించి, సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిలా పారదర్శకంగా సేవలు అందిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా అర్హులకు వివిధ ధ్రువ పత్రాలను ఎమ్మెల్యే ప్రసాదరాజు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగరాయుడు, వైస్ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సయ్యద్‌మౌలానా ఫాజిల్, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, దొంగ మురళీకృష్ణ, కడలి రాంబాబు, భూసారపు జయ, బర్రి శంకర్, కావలి నాని, మోకా రాజు, మోకా అశ్వినితేజ, తోట తాతాజీ, ఎండీ ఖాసి, బాషాఖాన్, శిరిగినీడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మొగల్తూరు: సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. రామన్నపాలెం పంచాయతీ పిప్పళ్ల వారితోటకు చెందిన పిప్పళ్ల భారతీ వెంకటలక్ష్మి అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం రామన్నపాలెం–1 సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రూ.90 వేలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆమెకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందెల ఏలిషా, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు అయితం ధనలక్ష్మి, ఆకన దుర్గ, నాయకులు కర్రి ఏసుబాబు, గుత్తుల రాధాకృష్ణ, అనంత సుబ్రహ్మణ్యం, అయితం బాబులు, పిప్పళ్ల పండు, అడ్డాల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

చీఫ్‌విప్ ప్రసాదరాజు పరామర్శ

రామన్నపాలెం పంచాయతీ పిట్టావారిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లాబత్తుల సత్యానందం అనారోగ్యానికి గురయ్యారు. ఆయన్ని మంగళవారం చీఫ్ విప్ ముదునూరి ప్రసదరాజు పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

పాలకొల్లు సెంట్రల్: ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్యార్థి దశ నుండే ఒక గోల్‌ను ఏర్పాటుచేసుకోవాలని ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్, హెదరాబాద్ సునీతరావు, ఐఆర్‌ఎస్ అన్నారు. మంగళవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 41వ వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో మెలిగితే ఎంత కష్టమైనా విజయాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ సి.రవిశంకర్, పూర్వవిద్యార్థి సంఘ ప్రెసిడెంట్ నాగలక్ష్మి, సీపీడీ సభ్యులు అడబాల రమణ, కొమ్ముల మురళి, జనార్ధన గుప్తా, నారాయణరావు, డా.వర్మ, వీరాస్వామి, మైథిలి తదితరులు పాల్గొన్నారు.


డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్ సునీతరావు

లక్ష్యం దిశగా జగనన్న సురక్ష

పెనుగొండ: అర్హుడైన ఏ ఒక్క పేదవాడికీ అన్యాయం జరగకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష సత్ఫలితాలను అందిస్తోంది. పెనుగొండ మండలంలో 12,102 మందికి జగనన్న సురక్షలో ధ్రువ పత్రాలను అందించి రికార్డును నెలకొల్పారు. సంక్షేమ పథకాలకు ధ్రువ పత్రాలు అడ్డంకిగా మారడం, కొన్ని పథకాలు అర్హత ఉన్నా అడ్డంకులు రావడం, కొత్త రేషన్ కార్డులు వంటి సమస్యలు పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జూలై 1న ప్రారంభించారు. పెనుగొండ మండలంలో 20 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్షలో 12,102 పత్రాలతో పాటు, మరో 1891 మందికి వివిధ సేవలు అందించారు. జగనన్న సురక్షపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రేషన్ కార్డు అందుకొన్నాం




జగనన్న సురక్షలో వలంటీరు ద్వారా కొత్త రేషన్ కార్డు అందుకొన్నాం. ఎంతో కాలంగా కొత్త కార్డు కోసం ఎదురు చూశాం. జగనన్న సురక్షతో సమస్యకు పరిష్కారం లభించింది. వలంటీర్లు, అధికారులకు కృతజ్ఞతలు. జగనన్న సురక్ష ఎంతో మందికి ఉపయోగపడుతుంది.

– టి.లక్ష్మీ గంగా భవాని, పెనుగొండ

కేంద్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను అమలుచేయాలి

సాక్షి, భీమవరం : రైతులు ఏడాదిపాటు చేసిన పోరాటానికి దిగివచ్చి కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మద్దతు ధరలు గ్యారెంటీ చట్టాన్ని తేవాలని, రుణ విమోచన చట్టం చేయాలని, విద్యుత్ సంస్కరణలు నుంచి వ్యవసాయాన్ని మినహాయించాలని సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం భీమవరంలోని సీఐటీయూ కార్యాలయంలో అఖిలపక్ష రైతు సంఘాలు, కార్మిక సంఘాలు సమావేశం అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబురావు మాట్లాడుతూ రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల ఆత్మహత్యలను నివారించాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుంటే రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.


సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: కార్గో సేవలు, విద్యార్థులకు అందిస్తున్న రాయితీలు, శుభకార్యక్రమాలకు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సుల ఏర్పాటు, సిబ్బంది ప్రవర్తన తదితర సమస్యలపై బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆర్టీసీ స్థానిక డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్న రెడ్డి తెలిపారు. ప్రయాణికులు ప్రజా రవాణా సేవలపై సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

రాజ్యలక్ష్మికి సత్కారం


సచివాలయ కార్యదర్శిని సత్కరిస్తున్న సర్పంచ్

పెనుగొండ: సచివాలయ కార్యదర్శి చెల్లంకి వెంకట రాజ్యలక్ష్మి ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించడానికి చేసిన కృషి అభినందనీయమని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోని అన్నారు. మంగళవారం పెనుగొండ పంచాయతీలో బదిలీపై విజయనగరం బదిలీ వెళుతున్న రాజ్యలక్ష్మిని సత్కరించారు. ఇన్‌చార్జి కార్యదర్శి డీఎం మహంతి, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

సాక్షి, భీమవరం : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర మంగళవారం సాయంత్రం భీమవరం ప్రకాశం చౌక్‌కు చేరుకుంది. పట్టణ కమిటీ సైకిల్ యాత్ర బృందానికి స్వాగతం పలికి వారి మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి పెద్దిరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ సైకిల్ యాత్ర కొనసాగుతుందన్నారు. విద్యార్థులను కలసి వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు.

క్రైస్తవులపై మారణహోమం అమానుషం


బెత్లహెమ్ చర్చి వద్ద ప్రార్థన చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరుగుతోన్న మారణహోమాన్ని నిరసిస్తూ నరసాపురం క్రిష్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బెత్లెహెమ్ చర్చి ఆవరణలో శాంతి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొందా రత్నరాజు, అజరయ్యజాన్, ఏవీడీ ప్రసాద్, ఎలియారాజు తదితరులు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఒక తెగలో 99 శాతం క్రైస్తవులు నివసిస్తుంటారన్నారు. అయితే మే నెల నుంచి క్రైస్తవులు, చర్చిలపైనా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగ జాతుల వర్గాల్లో చిచ్చుపెట్టి ఈ దాడులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మణిపూర్‌లో అల్లర్లు సృష్టిస్తున్న వారిని గుర్తించి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవులపై దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో గోడి దైవప్రసాద్, చుట్టుగుల్ల జాన్‌బాబు, అరిటాకుల సుగుణపాల్, కోటిపల్లి శ్రీరామచంద్రమూర్తి, కాకిలేటి డేనియల్, జాన్ బి ఆర్ గంటా, గోగులమండ సుగుణరావు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో దివీస్ లాబోరేటరీస్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. 2019 నుంచి 2022, 2023 (ఫైనల్ ఇయర్) డిగ్రీ ఏదైనా బీఎస్సీ కెమిస్ట్రీ ఒక సబ్జెక్టు చదివిన, పీజీలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలటికల్ కెమిస్ట్రీ, ఎం ఫార్మసీ, (పీఏ అండ్ క్యూఏ), బీ ఫార్మసి చదివిన విద్యార్థులు అర్హులన్నారు. బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరవ్వాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. జేకేసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ప్లేస్మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ని నాటకాలాడినా ఫలితం ఉండదు'

పెనుగొండ: టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా, నాటకాలడినా ఫలితం ఉండదని, మరోసారి సీఎం జగన్ ముఖ్యమంత్రి అవడం ఖాయమని విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ గ్యారెంటీలో టీడీపీ చెప్పి అబద్దాలు తట్టుకోలేక స్టేజీ కూలిపోయిందని, వారి ఏర్పాటు చేసిన స్టేజీకే గ్యారెంటీ లేదని, రాష్ట్ర ప్రజలకు గ్యారెంటీ ఎక్కడదని ప్రశ్నించారు. సరికొత్త మ్యానిఫెస్టో అంటూ చైతన్య రథయాత్ర అంటూ టీడీపీ నాయకులు ప్రజల్లోకి వెళుతున్నా ఎటువంటి ప్రయోజనం ఉండదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు సాధించి జగన్ సీఎం అవడం ఖాయమన్నారు. వాస్తవాలను టీడీపీ గ్రహించాలని హితవు పలికారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిలో పంటల సాగు, తెగుళ్ల నివారణ తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ శిక్షణ డివిజన్ ఇన్‌చార్జి నరసింగరావు, మండల ఇన్‌చార్జి కె.నాగరాజు మాట్లాడుతూ వరిపంటను ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మావిరిడి, ఫంగస్‌లు, రసం పీల్చే పురుగు, కాండం తొలచే పురుగు, దోమ నివారణకు వెట్టిశీలియం ఇసారియా బవేరియా మెటరైజం అనే బ్యాక్టీరియా బయోకల్చర్‌లను వాడాలని సూచించారు. ఆరు రకాల బయోకల్చర్‌ల తయారీ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా 50 లీటర్ల అగ్నిస్త్రంతో తయారు చేసి రైతులకు అందించారు. ఉద్యానశాఖ అధికారి జీవన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రవళిక, పి.పుణ్యవతి, దిలీప్ పాటియా, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.